క్లుప్తంగా

ట్రాన్స్‌కో కార్యాలయాల్లో పారిశుధ్య చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శనివారం ట్రాన్స్‌కో కార్యాలయాలను సిబ్బంది శుద్ధి చేశారు. స్థానిక గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయం, గాంధీరోడ్డు, పాత కలెక్టరేట్‌లోని అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయాల్లో చెత్త చెదారాలు తొలగించారు. అర్బన్ డివిజన్ కార్యాలయంలో సిబ్బందికి పలు సూచనలను ఈఈ మునిచంద్ర తెలియజేశారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సరస్వతీ పూజలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలో తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు భాస్కరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. సరస్వతి దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గురించి తెలియజేశారు. ప్రభుత్వ బడులు అమ్మ ఒడిలాంటివన్నారు. పేద విద్యార్థులు పైసా ఖర్చులేకుండా ఒకటో తరగతి నుంచి ఉన్నత విద్యవరకు చదువుకునే అవకాశం కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార ప్రదర్శనలో అంగన్‌వాడీ సిబ్బంది

గుడిపాల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత తెలిపారు. చలిచీమలపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పఖ్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌషకాహారం వల్ల గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో ప్రతి ఒక్కరూ విధిగా నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. గర్భిణీ దశ నుంచి వారు ప్రసవించిన రెండేళ్ల వరకు తల్లీ బిడ్డల ఆరోగ్య స్థితిని మెరుగు పరిచే విధంగా వెయ్యిరోజుల పాటు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గిరిజ, షీల, దీప తదితరులు పాల్గొన్నారు.

మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: గత కొన్ని రోజులుగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందూ కుటుంబాలపై జరుగుతున్న దౌర్జన్యకాండపై అక్కడి మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శనివారం గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి అనంతరం డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడుల జరుగుతున్నప్పటికీ అక్కడి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివకుమార్, బీజేపీ నాయకులు చిట్టిబాబు, కరుణాకర్, రామభద్ర, బ్రహ్మానందరెడ్డి, రఘు, బాలాజీ, రమేష్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతితో అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ అర్చకులు వేణుగోపాల్ శనివారం కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన పీఠాధిపతిని అర్చకులు కలిశారు. ఆలయంలో శ్రీమద్ రామయణ యజ్ఞపూర్వక మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవంపై చర్చించారు.

నిస్సార భూమికి నవ బలం

- నవధాన్యాల సాగుతో పోషకాలు
- రైతులకు అదనపు ఆదాయం
- రసాయన ఎరువులు, పురుగు మందులను తగ్గించవచ్చు

ఐరాల: అధునాతన కాలంలో రైతులు అధిక దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో అధిక మొత్తంలో ఎరువులు వినియోగిస్తున్నారు. అధిక మొత్తంలో ఎరువులు వినియోగించడం ద్వారా భూమిలోని సారం తగ్గిపోతూ వస్తుంది. వ్యవసాయంలో మితిమీరిన రసాయనాలు వాడడం వల్ల పసిడి పంటలు పండే భూములు సహజ శక్తిని కోల్పోయాయి. అలాంటి పరిస్థితుల్లో నేలలను పునరుజ్జీవింప చేయడానికి వ్యవసాయ శాఖ, అనుబంధాల శాఖ ప్రత్యేక కార్యాచరణ చర్యలు తీసుకుంటోంది. భూములను సారవంతం చేసే దిశగా అడుగులు వేయాలని, ఎరువులు, పురుగుల మందులకు చెక్ పెట్టి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. దీంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ భూసారం సాధించే దిశగా నవధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు. పచ్చి రొట్ట సాగుతో పచ్చని పంటలు పండే విధంగా ప్రకృతి వ్యవసాయంపై అధికారులు రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు

సేంద్రియ ఎరువుల్లో ఎన్నో రకాలున్నాయి. వాటిలో ఒకటి ఈ నవధాన్యాల సాగు. సాధారణంగా నవధాన్యాల సాగును వేసవిలో చేపడతారు. ఈ నవధాన్యం మొక్కలు భూమికి పునర్జీవం పోసి సారవంతం చేయడంలో సహాయపడతాయి. ఈ నవధాన్యాల సాగు ప్రకృతి వ్యవసాయంలో ఒక భాగం. అంతేకాకుండా నవధాన్యాల సాగుకు అయ్యే ఖర్చు కూడా తక్కువే. వివిధ కారణాలతో క్రమంగా భూములు తమ బలాన్ని కోల్పోతున్నాయి. దీంతో సూక్ష్మ పోషక లోపాలు బయటపడుతున్నాయి. ఫలితంగా భారీ పెట్టుబడులు పెట్టినా ఆశించిన దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు కాక రైతులు నష్టపోతున్నారు. రానున్న రోజుల్లో భూసారం లేక ఏ పంటలు వేసినా పండని పరిస్థితులు నెలకొంటాయి. వాటిని అధిగమించడానికి నవధాన్యాల సాగు చేపట్టాలి. వీటిని సాగు చేసి భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో సూక్ష్మ పోషక విలువలు వృద్ధి చెంది, భూసారం పెరిగి ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడి వస్తుంది. నవధాన్యాల సాగు చేపట్టాలనుకున్న రైతులు వేసవిలో లేదంటే పంటకు పంటకు మధ్య ఉన్న సమయంలో కూడా వీటిని సాగుచేయొచ్చు. నవధాన్యాల సాగు ద్వారా మట్టిలో పోషక విలువల శాతం పెరుగుతుంది. మొక్క ఎదుగుదలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం లభ్యత పెరగడమే కాకుండా, సూక్ష్మపోషకాలు కూడా మట్టిలో కలిసి మొక్క ఎదుగుదలకు దోహదపడతాయి. నవధాన్యాలను పచ్చి రొట్ట ఎరువుగా వాడటం మూలాన చౌడు సమస్యను కూడా నివారించవచ్చు. నేల నుంచి సంక్రమించే ఎన్నోరకాల తెగుళ్లను నివారించడం లోనూ పచ్చి రొట్ట ఎరువులు తోడ్పడతాయి. దీంతో పాటు రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు.



మిట్టూరులో సాగు చేసిన నవధాన్యాల పంట

నవధాన్యాల సాగు ఇలా

మెట్ట, మాగాణి భూములను బాగా దుక్కి చేసుకుని వర్షం కురిసిన సమయంలో సిద్ధం చేసుకున్న నవధాన్యాల విత్తనాలను చల్లుకోవాలి. నీటి సౌలభ్యం ఉంటే ఎప్పుడైనా వీటిని సాగు చేసుకోవచ్చు. ఖరీఫ్, రబీ సీజన్ ఆరంభంలో సాగు చేస్తే వరి సాగు చేసే రైతులకు పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించుకోవచ్చు. ఎకరానికి 14 కిలోల నవధాన్యాల విత్తనాలు అవసరం అవుతాయి. విత్తనాలు చల్లుకొని 45 నుంచి 60 రోజులల్లోపు పైరును రొటోవేటర్‌తో కలియదున్నితే సారవంతమైన ఎరువుగా పంటకు పోషకాలను అందిస్తుంది. నవధాన్యాలు అంటే నవగ్రహాల పూజలకు వాడే ధాన్యాలుగానే చాలామందికి తెలుసు. కేవలం దైవ పూజలకు మాత్రమే వాడే నవధాన్యాలు ఇప్పుడు రైతుకు వరంగా మారాయి. గోధుమలు, వరి, కందులు, పెసర్లు, మినుములు, శనగలు, బొబ్బర్లు, నువ్వులు, ఉలవలు వంటి తొమ్మిది రకాల నవధాన్యాలు ఇప్పుడు భూసారం పెంపులో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, కోళ్ల ఎరువు, గొర్రె ఎరువు తదితర సహజంగా లభించే ఎరువులు సామాన్య రైతుకు లభ్యం కావడం భారంగా మారింది. వాటి స్థానంలో ప్రతి రైతుకు అందుబాటులో ఉండే సహజ సిద్ధ ఎరువుల తయారీకి నవధాన్యాల సాగు ఒక వరంగా మారింది. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట సాగుతో పాటు నవధాన్యాల సాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. తొమ్మిది రకాల ధాన్యాలను రబీకి చివరిలో చల్లుకొని కోతలు పూర్తయ్యాక వాటిని కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చు.



నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి



గత నాలుగేళ్లుగా విత్తనాలు చల్లుకొని కలియదున్నడం వల్ల ఎరువుల వాడకం తగ్గింది. మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. నవధాన్యాల సాగు రైతులకు చాలా మంచిది. వీటి వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు రసాయనిక ఎరువులు లేని ఆరోగ్యకర పంటలు అందుబాటులోకి వస్తాయి. నేను మూడు ఎకరాల్లో నవధాన్యాల సాగు చేశాను. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

–యేతేంద్ర, రైతు, మిట్టూరు, ఐరాల

అవగాహన కల్పిస్తున్నాం



నవధాన్యాలు సాగు చేసి దున్నడం వల్ల భూసారం సహజ సిద్ధంగా పెరుగుతుంది. ప్రస్తుతం మండలంలో చిగరపల్లె, పొలకల, నాంపల్లె క్లస్టర్ పరిధిలో సుమారు 250 ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేస్తున్నారు. ఏపీసీఎన్ఎఫ్ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ మహిళా సంఘాల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించేలా కృషి చేస్తున్నాం. ఈ వారం నుంచే అన్ని గ్రామాల్లోను రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

–హనుమంతు, ప్రకృతి వ్యవసాయాధికారి, ఐరాల

డెంగీ కేసులపై అప్రమత్తం



మాట్లాడుతున్న మలేరియా అధికారి వేణుగోపాల్

తవణంపల్లె : డెంగీ కేసులు నమోదు కాకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. శనివారం తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 9 డెంగీ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. డెంగీ కేసులు రాకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలో అంతమొందించాలని సూచించారు. దోమలు అరికట్టడానికి ఫాగింగ్ చేయించాలన్నారు. ఇళ్లలో దోమల నివారణకు మందులు స్ప్రేయించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి రామకృష్ణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శివసుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నారాయణ, రాజశేఖర్, హరి, నిర్మల, రెడ్డెమ్మ, సుబ్రమణ్యంరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం !



భరతనాట్య ప్రదర్శనలో కళాకారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకక్షేత్రంలోని ఆస్థాన మండపంలో ఆదివారం నిర్వహించిన భరతనాట్యం ఆకట్టుకుంది. బెంగళూరుకు చెందిన నాట్యశాల బృందం భరతనాట్యం అలరించింది. హరికథ, అన్నమయ్య కీర్తనలు ఆహూతులను కట్టిపడేశాయి. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను అభినందించారు.

స్వచ్ఛాంధ్ర సాధించడమే లక్ష్యం

తవణంపల్లె: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని తవణంపల్లె ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పథకం అమలులో భాగంగా శనివారం మండలంలోని మేజర్ పంచాయతీ అరగొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అరగొండ కొత్త బస్టాండులో మానవహారం నిర్వహించారు. గ్రామాల్లో వీధుల్లో చెత్తలేకుండా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిస్తే ప్రజలకు వ్యాధులు సోకకుండా అరికట్టవచ్చని చెప్పారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు నిర్వహణ, పంచాయతీల్లో వ్యర్థాలు సేకరించి వ్యర్థ నిర్వహణ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాఘవేంద్రరాజు, అరగొండ మేజర్ పంచాయతీ ఈఓ కె.మురుగేషన్, పైమాఘం సచివాలయ కార్యదర్శి మహేష్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్యం కార్మికులు స్థానికులు పాల్గొన్నారు.

ఈ–వ్యర్థాల వినియోగమే మానవాళికి శ్రీరామరక్ష



ఈ–వ్యర్థాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: సమాజంలో పర్యావరణానికి ఈ–వ్యర్థాలు తీవ్రంగా హాని చేస్తున్నాయని, వాటిని వినియోగించడమే మానవాళి మనుగడకు రక్ష అని గుడిపాల ఎంపీడీవో కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఈ–వ్యర్థాలపై గుడిపాలలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ సమాజంలో పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలను పూర్తిస్థాయిలో పునఃశుద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గుడిపాలలో ఈ–వ్యర్థాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కృష్ణప్రసాద్, ఏపీఎం సాయిసుధ, పంచాయతీ కార్యదర్శి సుందరేషన్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

ఐరాల: నోటి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పీ.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. కాణిపాకం పీహెచ్‌సీలో శనివారం వైద్యాధికారి స్వాతి సింధూర ఆధ్వర్యంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్స మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నోటి శుభ్రత, దంత ధావనం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ ఆరోగ్యం కోసం శీతల పానీయాల వినియోగం తగ్గించాలన్నారు. తీపి పదార్థాలను తక్కువగా తీసుకోవాలని చెప్పారు. పొగాకు వాడకం, మత్తు పదార్థాలను సేవించడం మానుకోవాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులు ఉన్న వారు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. నోటి శుభ్రత, దంతాల శుభ్రత ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తోందని చెప్పారు. నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కాణిపాకం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఏ హ్యాపీ మౌత్ ఈజ్ ఏ హ్యాపీ మైండ్ అనే థీమ్‌తో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గురుగూరమ్మ తిరునాళ్లు



పూజలందుకుంటున్న గురుగూరమ్మ అమ్మవారు

గుడిపాల: వైభవోపేతంగా గురుగూరమ్మ తిరునాళ్లు గురుగునెత్తం గ్రామంలో శనివారం నిర్వహించారు. మండలంలోని నంగమంగళం పంచాయతీ గురుగునెత్తం గ్రామంలో గురుగూరమ్మ తిరునాళ్ల ఇరవై ఒకటో సంవత్సరం తిరునాళ్లు అతివైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, గంగపూజ, గణపతిహోమం, నవగ్రహ హోమం, శ్రీదేవి అంకరణతో పాటు మధ్యాహ్నం సుమారు వెయ్యిమందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొని అభిషేకం చేశారు.

మానసిక ఉల్లాసానికే క్రీడలు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుడిపాల: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్, చిత్తపార గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. చిత్తపార గ్రామంలో శనివారం యువత ఆధ్వర్యంలో వారు క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మానసిక ఉల్లాసానికి ఈ క్రీడలు ఉపయోగపడతాయని చెప్పారు. చిత్తపార గ్రామానికి చెందిన ఎస్‌కేబీఎస్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.10వేలు, మూడవ బహుమతి రూ.7 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్యం

గుడిపాల: మండలంలోని గ్రామాల ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు గుడిపాల, బొమ్మసముద్రం వైద్యాధికారులు సంధ్య, రష్మిత తెలిపారు. పెద్దిశెట్టిపల్లె, మండిక్రిష్ణాపురం గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. 110 మందికి వైద్యసేవలను వారు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తేజ, ఇందుమతి, నిరోషా, నరసమ్మ, పవిత్ర, శ్రీలత, రూబి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ ఆరిఫ్

బంగారుపాళెం: పాడి రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించి లాభసాటిగా రాణించాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరిఫ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం పాడిరైతులకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాడి రైతులకు లాభసాటి మార్గాలైన పాడిపోషణతో పాటు గొర్రెలు, మేకలు, బ్రాయిలర్ కోళ్ల పెంపకం, పెరటికోళ్ల పెంపకం చేపడితే ఆర్థికంగా లాభపడేందుకు అవకాశం ఉందన్నారు. వాటిని ఎలా పెంచాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆసక్తి కలిగిన రైతులు ఆయా పశువైద్యులను సంప్రదించి ఆయా రంగాలను ప్రారంభించి అధిక లాభాలను సాధించుకోవచ్చన్నారు. నెక్ చైర్మన్ శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ, పెరటి కోళ్లు పెంచే రైతులు వ్యాధులు నివారించేందుకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. మాజీ చైర్మన్ రమేష్ బాబు మాట్లాడుతూ, బంగారుపాళెం మండలంలో బ్రాయిలర్ కోళ్ల పెంపకానికి వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో బ్రాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించే పాడిరైతులకు ప్రభుత్వ పరంగా రాయితీ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బంగారుపాళెం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డాక్టర్ షేక్ ఆసీఫ్, డాక్టర్లు మోహన్‌బాబు, ఝూన్సీ, బాలాజీ హేచరీస్ మేనేజర్ రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి గౌతులచ్చన్న కృషి



బంగారుపాళెంలో గౌతులచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బంగారుపాళెం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటునడిన మహోన్నత వ్యక్తి స్వాతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర ఈడిగగౌడ్ సంఘం కార్యదర్శి బుస్సా నాగరాజగౌడ్ అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో శనివారం ఈడిగగౌడ్ సంఘం కార్యాలయంలో సర్దార్ గౌతులచ్చన్న 19వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగరాజగౌడ్ మాట్లాడుతూ, పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్ర గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు నీరజాక్షులుగౌడ్, మహేంద్రగౌడ్, గౌడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్‌గౌడ్ మాట్లాడుతూ, పారిశ్రామిక కల్లుగీత సహకార సంఘాలను ఏర్పాటు చేసి వారి జీవనాభివృద్ధికి గౌతులచ్చన్న పాటుపడ్డారని చెప్పారు. కార్యక్రమంలో గౌడ యువసేనా జిల్లా ప్రధాన కార్యదర్శి మురళిగౌడ్, మండల గౌడ సంఘం నాయకులు బాలాజీగౌడ్, గోపిగౌడ్, నాగయ్యగౌడ్, హరి గౌడ్, లోకనాథం గౌడ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులకు సేవలందిస్తున్న స్థానికులు

గుడిపాల: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గుడిపాల క్రాస్‌లో శనివారం రాత్రి చలిచీమలపల్లెకు చెందిన పూర్ణచంద్ర (26), గుడిపాల ఆదిఆంధ్రవాడకు చెందిన బన్ని(24), కావ్య(17) ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇందులో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల విజయకేతనం





విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ చైతన్య ప్రిన్సిపల్, విద్యార్థులను అభినందిస్తున్న పీఎస్ఎన్ వివేకానంద కళాశాల నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన ఆ విద్యార్థులను ఆయా కళాశాలల నిర్వాహకులు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు.

పీఎస్ఎన్ వివేకానంద విద్యార్థుల సత్తా

నగరంలోని మురగానపల్లిలో ఉన్న పీఎస్ఎన్ వివేకానంద కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటారు. ఆ కళాశాలలో చదువుతున్న అనీష్ 99.13, పవన్‌కల్యాణ్ 98.79, మహితా కీర్తి 98.61, యోహిత్‌సాయి 98.19, తేజా 97.27, హాసిని 96.26, గణేష్ 96.10, సాహితి 95.98, లిఖిత 95.19, మన్యతారెడ్డి 94.70, స్నేహ 93.92, జిష్ణు రెడ్డి 93.10, రెడ్డి చర్విత 92.54, దిలీప్ కుమార్ 92.47, వినిత్ 91.93, ప్రశాంతి 89.37 పర్సంటైల్స్ స్కోర్ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి అభినందించారు.

శ్రీచైతన్యలో ఉత్తమ ఫలితాలు

నగరంలోని గాంధీరోడ్డులో ఉన్న శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. లోకేశ్వరి 1826 ఆల్ ఇండియా ర్యాంక్, పూజిత 12,760 ఆల్ ఇండియా ర్యాంక్‌లు సాధించారని ఆ కళాశాల ఏజీఎం ప్రసాద్, ప్రిన్సిపల్ శివకుమార్ వెల్లడించారు.